క్లుప్తంగా

మార్పు దిశగా ప్రయాణం



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మార్పు దిశగా ప్రయాణం, చట్టం, లింగ స్పష్టత, సంస్థల బాధ్యత అనే అంశాలపై విద్యార్థులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నాగరాజునాయుడు మాట్లాడుతూ విద్యార్థులు తమ బాధ్యతలను గుర్తించి సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలన్నారు. పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నరసింహవర్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మృత్యుంజయుడికి పూజలు



ప్రత్యేక అలంకరణలో మృత్యుంజయస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయ స్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూది వంటి వాటితో అభిషేకాలు చేపట్టారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళాలు



దాతల నుంచి విరాళం స్వీకరిస్తున్న ఆలయ ఈఓ బాపిరెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీ ప్రసన్న దంపతులు రూ.50,116, వారి కుమార్తెలు నిత్య, తన్వి పేరిట మరో రూ.50,116 విరాళంగా అందజేశారు. సోమవారం వారు శ్రీకాళహస్తీరున్ని దర్శించుకున్నారు. అనంతరం వారు ఆలయ అధికారులను కలిసి విరాళ నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆలయ పరిపాలన భవనంలో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి టి.బాపిరెడ్డిని కలిసి స్వామి అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

భక్తిప్రపత్తులతో విగ్రహ ప్రతిష్ఠాపన



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆర్.అనంతాపురంలో సోమవారం శ్రీ అంకాళమ్మ పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపన భక్తిప్రపత్తులతో నిర్వహించారు. తొలుత శాస్త్రోక్తంగా గోపూజ, హోమాలు చేశారు. ప్రాణ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.


యోగా విజేతలకు అభినందన



పతకాలతో విజేతలు

రేణిగుంట: జిల్లా యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో రేణిగుంట స్వామి వివేకానంద యోగా అసోసియేషన్ క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబరిచారు. ఐదు బంగారు, నాలుగు సిల్వర్, మూడు కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. విజేతలు బాలచందర్, భగవాన్‌దాస్, వినోద్‌కుమార్, గుణశేఖర్, లీలావతి, నందినికి సోమవారం స్వామి వివేకానంద యోగ అసోసియేషన్ గురువు వెంకటేష్ అభినందనలు తెలిపారు.

అమరరాజ ఫ్యాక్టరీ సందర్శన



హర్యానా మాజీ ఉపముఖ్యమంత్రిని సన్మానిస్తున్న అమర రాజా యాజమాన్యం

రేణిగుంట: హర్యానా రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి దుష్యంత్ సింగ్ చౌటాలా అమర రాజా గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గల్లా జయదేవ్, అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ చీఫ్ ఆపరేషనల్ ఆఫీసర్ నరసింహులు నాయుడుతో కలిసి సోమవారం రేణిగుంట సమీపంలోని అమర రాజా పరిశ్రమను సందర్శించారు. తన పర్యటనలో భాగంగా ఆయన పరిశ్రమల పరిసరాల్లో నిర్వహించిన పచ్చదనం అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా దుష్యంత్ సింగ్ చౌటాలా మాట్లాడుతూ అమరరాజా గ్రూప్ భారతదేశ వ్యాపార మేధస్సు, సాంకేతిక ఆవిష్కరణకు ప్రతీకగా నిలిచిందన్నారు. పర్యావరణ పరిరక్షణ నాణ్యత ప్రమాణాలు, సమాజ అభివృద్ధి వంటి అంశాల్లో వారు చూపుతున్న నిబంధత ఎందరికో ఆదర్శనీయమన్నారు.

మాకొద్దు ఈ 2G ఫోన్లు

"అప్పుడెప్పుడో 2జీ ఫోన్లు ఇచ్చారు. ఇప్పుడు 5జీ ఫోన్లు వచ్చాయి. ఆ పాతఫోన్లలో సిగ్నల్ రాదు.. నెట్‌వర్క్ పని చేయదు.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహార సరుకులు పంపిణీ చేయాలంటే యాప్‌లో నమోదు చేయాలి. అవి సపోర్టు చేయకపోతే మేము ఏమి చేయగలం.. ? ఫోన్లు పని చేయడం లేదని ఎన్నోసార్లు ఐసీడీఎస్ అధికారులకు, ప్రభుత్వానికి చెప్పినా స్పందన లేదు. అందుకే ఈ ఫోన్లలో పని చేయలేం.. వాటిని మీకే ఇచ్చేస్తాం.. ఈ నెల 5వ తేదీ నుంచి అంగన్‌వాడీలకు సంబంధించి రికార్డులు రాస్తాం" అంటూ అంగన్‌వాడీలు ఆగ్రహోద్రిక్తులయ్యారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి సీడీపీఓ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు.





శ్రీకాళహస్తి సీడీపీఓ కార్యాలయం ముందు సెల్‌ఫోన్లతో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, సత్యవేడు: ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

- నెట్‌వర్క్ రాదు.. సిగ్నల్ ఉండదు.. ఆన్‌లైన్ అసలు పని చేయదు
- వీటితో మేమెలా పని చేయగలం ?
- 5వ తేదీ నుంచి సరుకుల పంపిణీకి సంబంధించి రికార్డులు రాస్తాం
- ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి సీడీపీఓ కార్యాలయం ముందు ఆందోళన
- పాత ఫోన్లను అప్పగించేందుకు వచ్చిన అంగన్‌వాడీలు
- కార్యాలయ సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఆగ్రహం

శ్రీకాళహస్తి: అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణకు ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు పాతవి కావడంతో సపోర్ట్ చేయడం లేదని, అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నా పట్టించుకోవడం లేదని, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షురాలు భారతి ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణకు ప్రభుత్వం అందించిన ఫోన్లు సపోర్ట్ చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ల ఆధ్వర్యంలో సోమవారం సెల్‌ఫోన్‌లను సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా సోమవారం శ్రీకాళహస్తి సీడీపీఓ కార్యాలయానికి ఐఎఫ్‌టీయూ అనుబంధ ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో దాదాపు 200 మందికి పైగా అంగన్‌వాడీలు తిరిగి ఇవ్వడానికి వచ్చారు. అయితే ఈ విషయం తెలుసుకున్న కార్యాలయ సిబ్బంది ఎవరూ అందుబాటులో లేకపోవడంతో తమ ఫోన్లన్నీ కార్యాలయం ముందు పోగేశారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు స్త్రీ, శిశు సంక్షేమ కీలక బాధ్యతలను అప్పగించారని తెలిపారు. పోషణ ట్రాకర్, బాల సంజీవని యాప్‌లు ఈ మొబైల్ ఫోన్లలో ఓపెన్ కావడం లేదన్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారానే లబ్ధిదారులకు సరుకులు అందించాలనే నిబంధన ఉన్నా మొబైల్ సిగ్నల్ రాకపోవడం, సర్వర్లు పని చేయకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొన్ని సందర్భాల్లో అంగన్‌వాడీలపై అనుమానాలతో అధికారులకు ఫిర్యాదులు కూడా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. ఉన్న యాప్‌లు చాలదని.. ప్రధాన మంత్రి మాతృవందనం పథకాన్ని అంగన్‌వాడీలకు అప్పగించడం దారుణమన్నారు. ఈ పరిస్థితుల్లో తాము ఈ పాత ఫోన్లతో వర్క్ చేయలేమని స్పష్టం చేశారు. ఈనెల 5వ తేదీ నుంచి ఆన్‌లైన్ వర్క్ చేయలేమని అంగన్‌వాడీ సెంటర్లలో హాజరు, లబ్ధిదారులకు ఆహార పంపిణీ ఇతర పనులన్నిటికి సంబంధించి రికార్డులు రాస్తామని స్పష్టం చేశారు.

వేతనాలు పెంచండి..

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, గ్రాట్యూటీ జీఓలో మార్పులు చేయాలని, హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ప్రాజెక్టు అధ్యక్షురాలు శోభ, స్వరాజ్యలక్ష్మి, స్వర్ణ, కల్పన, వసంత, వనజ, తనూజ, సురేఖ, పద్మ, కౌసల్య, రాజేశ్వరి, లత, జహీరా బేగం, రేష్మ, కుసుమ, అలాగే సీఐటీయూ నాయకులు పుష్ప, రేవతి తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని 2జీ ఫోన్లు వద్దని..!

సత్యవేడు: అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణకు ఇచ్చిన 2జీ ఫోన్లు తమకు వద్దంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు సీడీపీఓ దేవకుమారికి అప్పగించారు. అంతకుముందు సీఐటీయూ ప్రాంతీయ కార్యదర్శి ఎం. రమేష్ ఆధ్వర్యంలో సీడీపీఓ కార్యాలయం వద్ద సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాల అంగన్‌వాడీ కార్యాకర్తలు179 మంది ధర్నా చేశారు. 2జీ ఫోన్లలో పోషణ్ ట్రాకర్, బాల సంజీవిని యాప్ అప్‌లోడ్ కావడం లేదని, ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా సరుకులు ఇవ్వలేక ఇబ్బందులు పడుతున్నామని అంగన్‌వాడీ కార్యకర్తలు సమస్యలపై ధ్వజమెత్తారు. సీఐటీయూ నాయకుడు రమేష్ మాట్లాడుతూ, అంగన్‌వాడీ సత్యవేడులో 4జీ, 5జీ ఫోన్లు పనిచేస్తున్నాయని, ప్రభుత్వం ఆధునిక ఫోన్లు అందజేయాలని, ఎఫ్ఈఆర్‌ఎస్ ఆన్ బొట్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ ఫోన్లో మాకు వద్దు బాబోయ్



సీడీపీఓ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రేణిగుంట: ఎప్పుడో తొమ్మిది సంవత్సరాల క్రితం ఇచ్చిన మొబైల్ ఫోన్లు ఇప్పుడు సరిగ్గా పనిచేయడం లేదని.. ఈ సమస్యను అనేకసార్లు అధికారులకు చెప్పినా.. చలనం లేకపోవడంతో పని చేయని ఫోన్లతో తాము కూడా పనిచేయలేం అంటూ నిరసిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసనకు దిగారు. తాము ఈ ఫోన్లతో పని చేయలేమంటూ మూకుమ్మడిగా మొబైల్ ఫోన్లను సీడీపీఓ అధికారులకు రిటర్న్ ఇచ్చారు. రేణిగుంట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని 135 అంగన్‌వాడీ కేంద్రాల్లోని కార్యకర్తలు సోమవారం స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ర్యాలీగా వెళ్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలోని సూపర్‌వైజర్లకు ఫోన్లు రిటర్న్ ఇచ్చారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు ధనమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలపై పలుమార్లు అధికారులకు విన్నవించుకున్న ఎవరు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పనిచేయిని ఫోన్లలో యాప్‌ల ద్వారా సమాచారం పంపాలంటే ఏ విధంగా సాధ్యమవుతుందన్నారు. నూతన ట్యాబ్‌లు, ఫైవ్ జీబీ డేటా ఇచ్చేంతవరకు ఆన్‌లైన్లో ఏ యాప్ ద్వారా సమాచారం సేకరించమని తెలిపారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి భాగ్యలక్ష్మి, సెక్టార్ లీడర్లు పాల్గొన్నారు.

షామియానా తెచ్చిన ఉపద్రవం!

- ఇరువర్గాల ఘర్షణ
- పరస్పరం కేసులు నమోదు

వరదయ్యపాళెం: ఓ షామియానా- ఇరువర్గాల గొడవకు కారణమైంది. వివరాలు..మండలంలోని పాదిరికుప్పంలో ధనంజయశెట్టి అనే వ్యక్తి ఇంట్లో ఆదివారం పొంగళ్ల కార్యక్రమానికి రాళ్లకుప్పం వద్ద ఉన్న తిరుమలకు చెందిన షామియానా దుకాణం నుంచి షామియానాలను అద్దెకు వేశారు. సాయంత్రం షామియానా తీసేందుకు దుకాణ యజమానికి తన సిబ్బంది సజన్, దిలీప్ అనే యువకులను పంపారు. అయితే ధనంజయశెట్టి కుమారుడు చంద్రశేఖర్ (చందు), తిరుపతి నుంచి వేడుకలకు వచ్చిన బంధువులు షామియానా సిబ్బందిని అడ్డుకుని ఆదివారం ఉదయం వరకు ఉంచాలని కోరారు. దీనికి ఒకరోజు అద్దె చెల్లించాల్సి వస్తుందని సిబ్బంది చెప్పడంతో వారు గొడవకు దిగారు. దీనిపై మాటామాటా పెరగడంతో చందు, వారి బంధువులు నదియ, బుజ్జమ్మ, కళ్యాణ్, సమీర్, సాయి, మరికొంత మంది మూకుమ్మడిగా దిలీప్, సజన్‌ను చుట్టు ముట్టి దాడికి దిగారు. దిలీప్ వారి నుంచి తప్పించుకోగా సజన్‌పై బీరు సీసాలు, కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. జరిగిన ఉదంతాన్ని సజన్ తన యజమాని తిరుమలకు చెప్పడంతో ఆయన హుటాహుటిన తన అనుచరులను వెంట బెట్టుకుని సంఘటనా స్థలానికి వెళ్లారు. అయితే దాడి చేసిన వారు అప్పటికే తిరుపతికి తిరుగు పయనం కావడంతో వారి వాహనాన్ని అడ్డుకుని దాడి చేసిన వారిని నిలదీశారు. దీనిపై ఇరువర్గాలు మరోసారి ఘర్షణకు దిగాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఇరువర్గాలపై ఎస్‌ఐ మల్లికార్జున కేసు నమోదు చేశారు. దాడికి పాల్పడిన తిరుపతికి చెందిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పుష్కరిణి నిర్మాణానికి రూ.70లక్షల విరాళం



భూమి పూజలో దాత కార్తికేయన్

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలో వెలసిన సర్వమంగళ సమేత శ్రీపళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో పుష్కరిణి నిర్మాణానికి తమిళనాడుకు చెందిన వ్యాపారవేత్త కార్తికేయన్ రూ.70లక్షల విరాళం అందించారు. సోమవారం ఈ మేరకు ఎమ్మెల్యే ఆదిమూలంతో కలిసి భూమి పూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈఓ లత, స్థానిక నేతలు సుబ్రమణ్యం, ఏవీఎం బాలాజీరెడ్డి(బుజ్జిరెడ్డి), మురళి, రాజమాణిక్యం, ఎస్‌ఎం సురేష్, ఇళంగోవరెడ్డి, పరంధామరెడ్డి పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ సుధాకర్

రేణిగుంట: మండలంలోని కేఎల్‌ఎం హాస్పిటల్ కూడలిలో సోమవారం సాయంత్రం గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. సరైన రికార్డులు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సరైన పత్రాలు, నంబర్ ప్లేట్ లేని వాహనాలకు మొదటిసారి ఫైన్ వేస్తామని, మళ్లీ దొరికితే వాహనం సీజ్ చేస్తామన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ లేకుండా వాహనాలను నడపరాదని తెలిపారు.

భారీ వర్షం



శ్రీకాళహస్తి: పట్టణంలో సోమవారం సాయంత్రం మూడు గంటలపాటు కురిసిన భారీ వర్షానికి కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉంది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉరుములు.. మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉరుములు మెరుపులు అధికంగా ఉండడంతో గంట పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

పరామర్శ



రామకృష్ణ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధు



ఈశ్వరమ్మను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పరిధిలో సోమవారం పలువురిని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. అందులో భాగంగా పట్టణంలోని బహదూరుపేటలో రామారావు టిఫిన్ సెంటర్ అధినేత రామకృష్ణ అనారోగ్యంతో మృతి చెందడంతో మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మూడవ వార్డు మాజీ కౌన్సిలర్ ఈశ్వరమ్మ మనవరాలు ప్రియ మరణించడంతో వారి కుటుంబాన్ని పరార్శించారు. పట్టణానికి చెందిన గుప్తా మెడికల్స్ అధినేత ఆనంద్‌రాజ్ గుప్తా అనారోగ్యంతో తిరుపతి అమరరాజా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు చల్ల జయరామయ్య, యుగంధర్‌రెడ్డి, సుధాకర్, వెంకటేష్, గోపి, సాధన మున్నా రాయల్, జయశ్యామ్, కంఠా ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

శ్రీకృష్ణ, ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఊరేగింపు



విశేష అలంకరణలో శ్రీకృష్ణ ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి

పిచ్చాటూరు: మండలంలోని పాపానాయుడుపేటలో వెలసిన శ్రీకృష్ణ ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి 155వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం బకాసురున్ని భీముడు వధించే కార్యక్రమం నేత్రపర్వంగా నిర్వహించారు. రాత్రి శ్రీకృష్ణ ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవమూర్తులను పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు, మహిళలు కర్పూర హారతులు పట్టి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

యోగా మాస్టర్ సుజాతకు బంగారు పతకాలు

శ్రీకాళహస్తి: యోగామాస్టర్ అయిలం సుజాతకు యోగా పోటీల్లో రెండు బంగారు పతకాలు లభించాయి. యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తిరుపతి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చాంపియన్‌షిప్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇందులో ఉమ్మడి జిల్లాల నుంచి యోగా విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తికి చెందిన శ్రీ శివసాయి యోగా సెంటర్ మాస్టర్ అయిలం సుజాతకు పోటీల్లో రెండు బంగారు పతకాలు లభించాయి. ఆమె వద్ద శిక్షణ పొందిన యక్షమైత్రి బ్యాక్ బెండింగ్‌లో మొదటి స్థానం, ఫార్వర్డ్ బెండింగ్‌లో మూడో స్థానం సాధించింది.

అర్బన్ ఎస్‌ఐగా నాగరాజు



రేణిగుంట: అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న అరుణ్ కుమార్ రెడ్డి శ్రీసిటీ స్టేషన్‌కు బదిలీ కాగా, ఆ స్థానంలో సోమవారం అనంతపురం జిల్లా నుంచి పదోన్నతి పొందిన ఎస్‌ఐ నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ చెంచులక్ష్మి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: తల్లిపాలే చంటిబిడ్డకు అమృతం అని.. అందుకే ప్రతి బాలింత పౌష్టికాహారం తీసుకుని పసిపిల్లలను సంరక్షించాల్సిన బాధ్యత వారిపై ఉందని స్త్రీశిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, ఇతర స్వచ్ఛంద సంస్థలకు చెందిన సిబ్బంది తెలిపారు. సోమవారం వారు శ్రీకాళహస్తి మడలంలో తల్లిపాలపై అవగాహన కల్పించారు. అనంతరం ముద్దుమూడి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీశిశు సంక్షేమ శాఖ, ప్రగతి స్వచ్ఛంద సంస్థ, విజయవాహిని చారిటబుల్ ట్రస్ట్, వైద్య ఆరోగ్యశాఖ, సంయుక్తంగా తల్లిపాల వారోత్సవాలు గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో వాటిని తీసుకుని బిడ్డలను సంరక్షించుకోవాలని తెలిపారు. ప్రగతి స్వచ్ఛంద సంస్థ శ్రీకాళహస్తి మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి వద్దనే పెరటి తోటలు పెంచుకుని తక్కువ ఖర్చుతో ఆకుకూరలు, కాయగూరలు పండ్లు తీసుకుని ఆరోగ్యం కాపాడుకుని బిడ్డలను ఎలాంటి అనారోగ్యం పాలు కాకుండా చూసుకోవాలని తెలిపారు. విజయ వాహిని చారిటబుల్ ట్రస్ట్ కోఆర్డినేటర్ లక్ష్మీ మాట్లాడుతూ ప్రతినెలా ప్రతి బిడ్డ ఎత్తుకు తగ్గ బరువు వయసుకు తగ్గ బరువు పెరుగుతున్నారా ? లేదా ? అని అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిరక్షించుకోవాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యకర్త రాజేశ్వరి మాట్లాడుతూ గర్భిణులు తప్పక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భం దాల్చిన వెంటనే పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. తల్లీబిడ్డల సంరక్షణపై ప్లేకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ముద్దుమూడి దొడ్లమిట్ట ముచ్చువోలు ఉడమలపాడు దొమ్మరపాలెం అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు కళావతి మాధవి, రంగమ్మ, సులోచన దేవి, జ్యోత్స్న పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో గర్భిణులు, బాలింతలు ప్లేకార్డ్స్ బ్యానర్లు తల్లిపాల విశిష్టతను తెలిపే విధంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

తల్లి పాలు అమృతంతో సమానం

సత్యవేడు: తల్లి పాలు అమృతంతో సమానమని సూపర్‌వైజర్ చెంచులక్ష్మి అన్నారు. సోమవారం నరసరాజు అగ్రహారంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ, శిశువు ఆరోగ్యంగా ఉండేందుకు ఆరు నెలల పాటు తప్పనిసరిగా పాలివ్వాలన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను రోసి వివరించారు. కార్యక్రమంలో టాటా ట్రస్ట్ న్యూట్రీషన్ ప్రోగ్రాం అధికారిణి సుప్రియ, అంగన్‌వాడీ కార్యకర్తలు కే. స్వర్ణలత, ఎస్.మాల, ఏడబ్ల్యూహెచ్ కుసుమ, ఆశావర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

తల్లిపాలే అమృతం

రేణిగుంట: పురిటి బిడ్డలకు తల్లిపాలే అమృతం అని సీడీపీఓ కృష్ణవేణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆగస్టు 1వ తేదీ నుంచి 7 తేదీ వరకు జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం మండలంలోని రామకృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల వల్ల శిశువులకు కలిగే ప్రయోజనాలపై ప్రతి తల్లి అవగాహన కలిగి ఉండాలన్నారు. సరైన పోషణ వల్ల శిశువుల ఆరోగ్యకరమైన పెరుగుదల, అభివృద్ధి చెందుతారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హేమావతి, అంగన్‌వాడీ కార్యకర్త పవిత్రబాయి, ఏఎన్‌ఎం లీలావతి, ఆశ వర్కర్లు దేవి, చాముండేశ్వరి, వీసీఎఫ్‌ఏ కృష్ణవేణి, వార్డు సభ్యురాలు కోటేశ్వరి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రీరామరక్ష

కేవీబీపురం: జన్మించినప్పటి నుంచి మూడేళ్ల బిడ్డలకు తల్లి పాలే శ్రీరామ రక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మూర్తి కల్పలత అన్నారు. సోమవారం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, పురిటి బిడ్డకు జన్మించిన గంట లోపు విధిగా తల్లిపాలను పట్టించాలన్నారు. .తల్లి పాలతోనే సంపూర్ణ పోషకాలు పుష్కలంగా అందుతాయని, ఇవి వ్యాధి నిరోధక శక్తి పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాజేశ్వరి, కల్పన, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

నేడు మండల సమావేశం

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరవుతారని, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పంచాయతీ అధికారుల హెచ్చరిక



పంచాయతీ గోడకు అంటించిన హెచ్చరిక నోటీసు

సాక్షి ఎఫెక్ట్..

రేణిగుంట: మేజర్ పంచాయతీలో యూనియన్ నాయకుల పెత్తనంపై గత నెల 27వ తేదీ సాక్షిలో 'పంచాయతీని శాసిస్తున్న యూనియన్లు' అనే కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎలాంటి సభలు, సమావేశాలు, యూనియన్ మీటింగులు జరపడానికి నిషేధం అని హెచ్చరించారు. ఇందులో భాగంగా ముఖ్య గమనిక పేరిట కార్యాలయం వద్ద నోటీసులు అంటించారు.

వ్యవసాయ పరికరాలు అందించండి

శ్రీకాళహస్తి: రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాలను అందజేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి కోరారు. ఈ మేరకు శ్రీకాళహస్తి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ రైతులకు సబ్సిడీపై స్ప్రేయర్లను, టార్పాలిన్ పట్టలు, డ్రోన్లు, రొటావేటర్లను అందజేయాలని కోరారు. రైతులపై ఆర్థిక, రుణభారం పడకుండా చూస్తూ ఆధునిక యాంత్రీకరణపై అవగాహన కలిగించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి, ఆంటోనీ పాల్గొన్నారు.